సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 8 । మే । 2023



మొక్కజొన్నతో లాభాల సిరులు
నీటి నదుపాయం ఉన్న ప్రాంతాల్లో మొక్క జొన్న సాగును గూడెంకొత్తవీధి మండలం లోని మాలీ రైతులు సాగు చేస్తున్నారు. 8లో



మరో మణిహారం సీ-హారియర్
విశాఖ బీచ్ రోడ్డులో సీ-హారియర్ మ్యూజియం విశాఖకు మరో మణిహారంగా మారుతుం దని కలెక్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. 8లో



గంజాయి పట్టివేత
ప్రైవేట్ బస్సులో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ రాజారావు తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ఏవోబీలో అప్రమత్తం
● ఎస్పీ తుహిన్‌సిన్హా



సాక్షి, పాడేరు: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని అటవీ ప్రాంతంలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్ నేపథ్యంలో ఏవోబీలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందగా, కొంతమంది తప్పించుకున్నారన్న సమాచారం ఉందన్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని పరిస్థితిపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ పోలీసు యంత్రాంగం నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నామన్నారు. ఈ పరిస్థితుల్లో చింతూరు పోలీసు యంత్రాంగంతో సమీక్షిస్తున్నట్టు తెలిపారు. చింతూరు, పాడేరు, చింతపల్లి పోలీసు సబ్‌డివిజన్‌ల పరిధిలో పోలీసు బలగాలతో ఏవోబీతో పాటు, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్‌కు ఆలోచన చేస్తున్నామని చెప్పారు. అన్ని అవుట్ పోస్టుల యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగానే ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ సుధాకర్, ఉత్సవ,ఆలయ కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: పాడేరులో ఈనెల 14 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదేవత మోదకొండమ్మతల్లి జాతరకు సంబంధించిన ప్రచార పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పాడేరు సీఐ సుధాకర్, స్థానిక సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, వైస్ ఎంపీపీలు కె. కనకాలమ్మ, గంగపూజారి శివకుమార్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, ఉత్సవకమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టగుల్లి సుబ్బారావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమర్బ ప్రసాద్‌నాయుడు, నవర మోదకొండబాబు, ఉప సర్పంచ్ బూరెడ్డి రామునాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహ మండలి అధ్యక్షురాలు సరస్వతి, ఎంపిటీసీ చల్లా చిట్టమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లకే రామసత్యవతి, మాజీ ఎంపీపీ వర్తన ముత్యాలమ్మ, వైఎస్ఆర్‌సీపీ మహిళ నేతలు కొట్టగుల్లి చిన్ని,కొండమ్మ గిరిజన ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నేతలు రొబ్బా నాగభూషణంరాజు,కిల్లు గంగన్నపడాల్,పలాసి కృష్ణారావు,జంపరంగి ప్రసాద్, కిల్లు రమేష్‌నాయుడు, కె.చిన్ని, కేజియారాణి పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి
ఎటపాక: ఈనెల 10న జరగనున్న ఏపీ పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎటపాక ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామసత్యనారాయణ తెలిపారు. చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే సహకారంతో గత 22 రోజుల నుంచి 263 మంది విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇచ్చినట్టు తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు జరిగే పాలిసెట్ పరీక్షకు మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎటపాక పాలిటెక్నిక్ కళాశాలలో 300 మందికి, నవోదయ విద్యాలయంలో 358 మందికి, చింతూరు గిరిజన పాఠశాలలో 372 మంది పరీక్ష రాసేలా ఏర్పాట్లుచేశామన్నారు. పరీక్ష కేంద్రంలో ఉదయం 10 గంటలకు అనుమతిస్తామన్నారు. విద్యార్థులు హెచ్‌బీ పెన్సిల్ తీసుకురావాలని సూచించారు.హాల్ టికెట్లు రాని వారు appolycet.nic వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

జిల్లా చదరంగం జట్ల ఎంపిక
విశాఖ స్పోర్ట్స్: జిల్లా చదరంగం జట్ల ఎంపిక(చిల్డ్రన్ చెస్ టోర్నీ) పోటీల్లో దేవాన్ష్, శ్రావణి, శంశాక్, తేజస్వి సత్తా చాటారు. అండర్-7 బాలుర విభాగంలో దేవాన్ష్ సాయి, 9లో శ్రీ అరుష్, 11లో శ్యామ్‌భార్గవ్, 13లో తనీష్, 15లో సుశేన, 17లో శశాంక్ విజేతలుగా నిలిచారు. అండర్-7లో బాలికల విభాగంగా శ్రావణి, 9లో ఆఫ్రీన్, 11లో రుషిత, 13లో బాంధవిక, 15లో శ్రియరాయ్, 17లో తేజస్వి తొలిస్థానాల్లో నిలిచారు. సీతమ్మధారలోని సామాజిక భవన్‌లో ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఈ పోటీలు జరిగాయి.

నేటి నుంచి కెరీర్ సెమినార్
మహారాణిపేట: చదువుకున్న యువతకు మార్గనిర్దేశం చేసేందుకు వైజాగ్ క్రిస్టియన్ ఇంటలెక్చువల్స్ అండ్ ప్రొఫెషనల్స్ ఫోరం ఆన్‌లైన్ కెరీర్ సెమినార్ నిర్వహిస్తుంది. ఈ నెల 8వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, రీసెర్చ్ విద్యార్థులు ఈ సెమినార్‌లో పాల్గొనవచ్చు. ఈ ఉచిత గూగుల్ మీట్‌లో పలువురు విద్యావేత్తలు, వైద్యులు, మేధావులు పాల్గొంటారు. ఆసక్తి గల వారు 90305 94055, 94918 27977లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

అల్లూరి కీర్తి చిరస్మరణీయం

- వీరమరణం పొందిన రాజేంద్రపాలెం రావడం పూర్వజన్మ సుకృతం
- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- రాజేంద్రపాలెంలో మ్యూజియం నిర్మాణానికి కృషి: ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- ఆశయాన్ని నెరవేర్చిన ప్రభుత్వం : ఐటీడీఏ పీవో అభిషేక్
- విప్లవ జ్యోతికి ఘన నివాళి



రాజేంద్రపాలెం పార్కులో అల్లూరి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గాం మల్లుదొర కుటుంబసభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పీవో అభిషేక్

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కీర్తి చిరస్మరణీయమని, ఆయన వీరమరణం పొందిన రాజేంద్రపాలెం రావడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఆదివారం వందో వర్ధంతిని రాజేంద్రపాలెం అల్లూరి స్మారక మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ అల్లూరి పార్కుల అభివృద్ధికి తమ వంతుగా నిధులు కేటాయిస్తామన్నారు. రాజేంద్రపాలెం పార్క్‌లో సేజి నిర్మాణానికి నిధులు ఇస్తామని ప్రకటించారు.రాజేంద్రపాలెంలో అతిథిగృహాన్ని విస్తరిస్తామని పేర్కొన్నారు. జెడ్పీ నిధులతో రోడ్డును ఆనుకుని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పారు.

మరో మ్యూజియం ఏర్పాటుకు కృషి

బ్రిటీష్ సేనల చేతిలో అమరుడైన అల్లూరితోపాటు సాయుధ పోరాటంలో పాల్గొన్న వారి పేరిట ఈ ప్రాంతంలో మరో మ్యూజియం నిర్మాణానికి వీలుగా సీఎంకు వినతిపత్రం ఇస్తామని ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి చేస్తామన్నారు.కృష్ణదేవిపేటలోని అల్లూరి పార్కును అల్లూరి జిల్లాకు ఇవ్వాలని సీఎంను కోరతామని ఆమె పేర్కొన్నారు.

జీవించింది 27 ఏళ్లు.. కీర్తి వందల ఏళ్లు..
: ఐటీడీఏ పీవో అభిషేక్

ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడింది రెండు నిమిషాలు అయినా ఆయన మాట్లాడుతున్నంత సేపు ప్రజల నుంచి చప్పట్లు మోగాయి. అల్లూరి జీవించింది 27 సంవత్సరాలు అయినా ఆయన కీర్తి వందల సంవత్సరాలు పాటు ఉంటుందన్నారు. నాడు ఆయన దేనికోసం పోరాటం చేశారో నేడు మన్యంలో అవి నెరవేరాయన్నారు. అటవిపై , భూమిపై హక్కులు ఉండాలని నాడు అల్లూరి చేసిన పోరాటం నేడు ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, అటవీ హక్కుల చట్టం ,1/70 చట్టాలతో ఆయన ఆశయం నెరవేరిందన్నారు. ఐటీడీఏ పీవోగా గిరిజనులకు మెరుగైన సేవలను అందిస్తామని తెలిపారు. అంతకుముందు అల్లూరితో పాటు గాం గంటన్నదొర, మల్లుదొర విగ్రహాలకు అతిథులంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘన సత్కారం

గాం మల్లుదొర కుటుంబ సభ్యులను వారు సత్కరించారు. వీరికి త్వరలో గృహాలు నిర్మిస్తామని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. అంతేకాకుండా అర్హతలను బట్టి ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం ఇచ్చేందుకు తమవంతుగా ప్రయత్నిస్తామన్నారు.అనంతరం మంపలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, చింతపల్లి జెడ్పీటీసీ పి.బాలయ్య, రాజవొమ్మంగి ఎంపీపీ గాం వెంకటలక్ష్మి, ట్రైకార్ డైరెక్టర్లు సుమర్ల సరస్వతి, లోవ రాజు, మండల ఉపాధ్యక్షులు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు,టీడబ్ల్యూ ఈఈ రాజు, జేఈ రామకృష్ణ, తహసీల్దారు తిరుమలరావు, ఎంపీడీవో మేరీరోజ్, ఏటీడబ్ల్యూవో క్రాంతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిసినాయుడు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, పీఏసీఎస్ డైరెక్టర్ సుమర్ల సూరిబాబు, రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

49 మంది రక్తదానం

అల్లూరి యూత్ ప్రతినిధి బల్ల ప్రసాద్ ఆధ్వర్యంలో రాజేంద్రపాలెం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన శిబిరంలో 49 మంది యువకులు రక్తదానం చేశారు. వీరికి జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. యూత్ సభ్యులు ఎస్ చిన్ని, లకే సురేష్, లాలం శేఖర్, రాజు, ప్రసాద్, బీడిపాలెం సర్పంచ్ ఎస్.సోమన్నదొర పాల్గొన్నారు.

నక్కలపుట్టులో అరకు ఎమ్మెల్యే పాల్గుణ..

సాక్షి, పాడేరు: మండలంలోని నక్కలపుట్టు జంక్షన్‌లో అల్లూరి విగ్రహానికి అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెదబయలు జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, మాజీ ఎంపీపీలు జర్సింగి సూర్యనారాయణ, సల్లంగి ఉమామహేష్, శ్రీను, చలం తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరిపేటలో ఎమ్మెల్యే ధనలక్ష్మి..

దేవీపట్నం: ఇందుకూరుపేటలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సేవలను కొనియాడారు. అల్లూరి పోరాట పటిమ ద్వారా స్ఫూర్తి పొందాలని అన్నారు. ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి, పార్టీ నాయకులు తోట రాజేశ్వరరావు, కట్టా సత్యనారాయణ, గారపాటి మురళీకృష్ణ, బండారు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నక్కలపుట్టు జంక్షన్‌లో నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు



ఇందుకూరుపేటలో నివాళులర్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

టెన్త్‌లో మెరిసిన గురుకులం

- 82.11 శాతం ఉత్తీర్ణత
- జిల్లా టాపర్‌గా కూనవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని జాహ్నవి శ్రీనిధి
- 588 మార్కుల సాధన



కిల్లో నీలవేణి(564)

సాక్షి,పాడేరు: పది ఫలితాల్లో గిరిజన సంక్షేమ గురుకులాల విద్యార్థులు సత్తా చాటారు. జిల్లాలో 17 గురుకులాల పరిధిలో 1198 మంది పరీక్షలు రాయగా, 952మంది ఉత్తీర్ణులయ్యారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 గిరిజన గురుకుల విద్యాలయాల్లో 749 మంది పరీక్షలు రాయగా, 615మంది ఉత్తీర్ణులయ్యారు. 82.11శాతం సాధించారు.

● కొయ్యూరు గురుకులంలో పరీక్ష రాసిన 76 మంది పాసవ్వడంతో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా జిల్లాలో గుర్తింపు దక్కింది.

● స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎస్ఓఈ) విశాఖలో 97.62శాతం, అనంతగిరి మండలం తుమ్మనవలసలో 95.38శాతం, అరకులోయ గురుకుల క్రీడా పాఠశాలలో 93.2 శాతం, జి.మాడుగుల గురుకులంలో 92 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఎస్ఓఈ చెందిన కిల్లో నీలవేణి 564 మార్కులు సాధించింది.

● గురుకుల విద్యాలయాల్లో అరకులోయ మండలం బస్కి పంచాయతీ దేవరాపల్లికి చెందిన కె.నీలావేణి అత్యధికంగా 564 మార్కులు సాధించింది.

● చింతూరు డివిజన్ పరిధి కూనవరం గురుకులంలో 78మందికి 75మంది ఉత్తీర్ణులయ్యారు.

జిల్లా టాపర్ జాహ్నవి..

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు సంబంధించి కూనవరం విద్యార్థిని జాహ్నవి శ్రీనిధి 588 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. జిల్లాలోని 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిధిలో 489 మంది పరీక్షలు రాయగా 207 మంది ఉత్తీర్ణులయ్యారు.

● కొయ్యూరు ఉన్నత పాఠశాలలో పరీక్షకు హాజరైన 41మంది పాస్ కావడంతో శతశాతం ఉత్తీర్ణత లభించింది.



జిల్లా టాపర్‌ను అందించిన కూనవరం హైస్కూల్

● గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి 6,983 మంది గిరిజన విద్యార్థులు పరీక్షలు రాయగా, 4118 మంది పాస్ అయ్యారు.

● కస్తూర్బా విద్యాలయాలకు సంబంధించి జిల్లాలోని 19 పరిధిలో 665 మంది పరీక్షలు రాయగా, 353 మంది ఉత్తీర్ణులయ్యారు. కొయ్యూరు కేజీబీవీలో కూడా శతశాతం ఉత్తీర్ణత లభించింది.

● జిల్లాలో 17 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 1134 మంది పరీక్షలు రాయగా,700మంది ఉత్తీర్ణులయ్యారు. కొయ్యూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 22 మందికి 22 మంది ఉత్తీర్ణులయ్యారు. మారేడుమిల్లిలో పరీక్ష రాసిన 11మంది పాసయ్యారు. ముంచంగిపుట్టు మండలం జోలాపుట్టు జెడ్పీ పాఠశాలలో 34 మందికి 31మంది, వై.రామవరంలో 22 మందికి 20మంది ఉత్తీర్ణులయ్యారు.

ఫలితాలు తగ్గడంపై సమీక్ష



జిల్లాలోని టెన్త్ పరీక్షల్లో ఫలితాలు తగ్గడంపై ఎంఈవోలు, హెచ్ఎంలతో సమీక్షిస్తున్నాం. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక బోధన కార్యక్రమాలు ఆదివారం నుంచి ప్రారంభించాం. గురుకుల విద్యాలయాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, జెడ్పీ, ఉన్నత పాఠశాలల్లో కూడా బోధన ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం.
– సలీమ్‌బాషా, డీఈవో, పాడేరు

మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం

ఘటాల ఊరేగింపుతో శ్రీకారం



అమ్మవారి ఆలయం నుంచి ఘటాల ఊరేగింపు

హుకుంపేట: మండల కేంద్రంలో మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చి శతకంపట్టు వద్ద కొలువుదీర్చారు. ఎంపీడీవో వెంకటరావు, ఎస్ఐ సతీష్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పాంగి అనిల్, మాజీ జెడ్పీటీసీ కొర్రా కాసులమ్మ, ఎంపీటీసీ రమ తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

ఈనెల 9 వరకు జరిగే మోదకొండమ్మ ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశామని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 80 మందితో బందోబస్తు ఏర్పాటుచేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. ఉత్సవాలు విజయవంతానికి అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

గిరిజనుల కోసం పోరాడిన అల్లూరి

కలెక్టర్ సుమిత్‌కుమార్



పాడేరు కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



అల్లూరి సమాధుల వద్ద నివాళులు అర్పిస్తూ..

సాక్షి,పాడేరు: పూర్వం గిరిజనుల సామాజిక, ఆర్థిక దుర్భర పరిస్థితులను చూసి చలించిపోయి, వారి సంక్షేమమే ధ్యేయంగా బ్రిటీష్ పాలకులను ఎదిరించి పోరాడిన అల్లూరి సీతారామరాజు అందరికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ఆదివారం అల్లూరి 100వ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ అల్లూరి ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని గిరిజనుల సంక్షేమం,అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సాధ్యమని నమ్మి, 27 ఏళ్ల వయసులో తన ప్రాణాలను అర్పించిన మహాయోధుడు అల్లూరి అని విశ్లేషించారు. ఆదివాసులు, రైతులు, సానుభూతిపరుల శక్తులను సమీకరించి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా గొరిల్లా పోరాటాలలో నిమగ్నమయ్యారని, అనేక పోలీస్ స్టేషన్లపై దాడి చేశారని, అతని వీరోచిత పరాక్రమాలను చూసి గిరిజనులు అతనిని మన్యంవీరుడిగా కీర్తించారని వివరించారు. ఆయన పేరుతో పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు అభినందనీయమని, అందుకు ప్రభుత్వానికి రుణపడి ఉందామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ జె.శివశ్రీనివాస్, డీఆర్వో పి.అంబేద్కర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు ఐటీడీఏలో

పాడేరు ఐటీడీఏలో అల్లూరి వర్ధంతి నిర్వహించారు. ఐటీడీఏ ఎదుట ఉన్న అల్లూరి విగ్రహంతో పాటు, సమావేశమందిరంలోని చిత్రపటానికి ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, పరిపాలనాధికారి హేమలత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అల్లూరి పార్కులో..

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు పలువురు ఘనంగా నివాళులర్పించారు. 100వ వర్ధంతి సందర్భంగా కృష్ణదేవిపేట అల్లూరి పార్కులోని సమాధుల వద్ద ఆదివారం నర్సీపట్నం ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అల్లూరి కాంస్య విగ్రహానికి, అల్లూరి తల్లి నారాయణమ్మ విగ్రహానికి పూలమాలలు వేశారు.

సింహగిరి ఘాట్‌రోడ్డులో బస్సు బ్రేక్ ఫెయిల్



ఘాట్‌రోడ్డులో నిలిచిన బస్సు

సింహాచలం: సింహగిరి ఘాట్‌రోడ్డులోఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ అయి వెనక్కి వెళ్లడంతో.. అందులో ప్రయాణిస్తున్న భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఆదివారం ఉదయం సుమారు 11గంటల సమయంలో ఆర్టీసీ బస్సు 10 మంది ప్రయాణికులతో కొండపైకి వెళ్తోంది. టోల్‌గేట్ దాటగానే ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఉన్న ఎగువ భాగంలో మలుపు తిరుగుతుండగా బ్రేక్‌లు ఫెయిల్ అవడంతో కుడి పక్కన ఉన్న కొండను ఢీకొట్టింది. వెనక్కి వెళ్లి.. మెట్ల మార్గానికి, ఘాట్ రోడ్డుకు మధ్యలోని రైలింగ్‌ను ఢీకొని నిలిచింది. లేకపోతే మెట్లమార్గంలోకి దూసుకెళ్లేది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న భక్తులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫౌండ్రీ పరిశ్రమలో విస్తృత ఉద్యోగావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ముత్తుకుమార్

మురళీనగర్: ఫౌండ్రీ పరిశ్రమలో మెటలర్జీ విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫౌండ్రీమెన్(ఐఐఎఫ్) సౌత్ రీజియన్ చైర్మన్ ఎస్.ముత్తుకుమార్ చెప్పారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఐఐఎఫ్ స్టూడెంట్ చాప్టర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐఎఫ్‌లో చేరిన మెటలర్జికల్ విద్యార్థులకు నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఫౌండ్రీ పరిశ్రమల్లో వస్తున్న నూతన సాంకేతిక విధానాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. వస్తువులను పోతపోసే విధానాల్లో అనూహ్యమైన మార్పులు చోటుచేసుకున్నట్లు వివరించారు. ఐఐఎఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆర్. ఆంజనేయప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని ఫౌండ్రీ పరిశ్రమ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు కలిగించడం, సమావేశాల్లో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఐఐఎఫ్ లక్ష్యమన్నారు. కళాశాల మెటలర్జీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ రత్నకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్ ప్రతినిధి వి.ఎస్ కిశోర్ కుమార్, పలు పరిశ్రమల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు అల్లూరి



విశాఖ నగరంలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: సాయుధ పోరాట యోధుడు, తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన అల్లూరి సీతారామరాజు నేటి తరానికి ఆదర్శనీయుడని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి మేయర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లూరి చిన్న వయసులో ప్రాణాలు కోల్పోవడం దేశానికి ఎప్పటికీ తీరని లోటన్నారు. అల్లూరి పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఏజెన్సీ ప్రాంతాలను కలుపుకుని అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్లు శ్రీధర్, కటుమూరి సతీష్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

బీచ్‌రోడ్డులోని అల్లూరి విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు.

మన్యంలో విస్తారంగా వర్షాలు



పాడేరు కలెక్టర్ కార్యాలయం సమీపంలో నేలకూలిన భారీ వృక్షం



పిడుగుపాటుకు మృతి చెందిన ఆవు



పాడేరులో కురుస్తున్న భారీ వర్షం



చింతపల్లిలో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా రోజు విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.ఆదివారం పాడేరు ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. కుమ్మరిపుట్టులోని కలెక్టరేట్ సమీపంలో అటవీశాఖ నర్సరీ సముదాయం గేటుపై భారీ వృక్షం కూలడంతో ధ్వంసమైంది.

డుంబ్రిగుడ: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

హుకుంపేట: మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తడిగిరి, తీగలవలస పంచాయతీల్లో పొలాలు, రహదారులపై నుంచి వర్షం నీరు ప్రవహించింది.

పిడుగుపాటుకు రెండు ఆవుల మృతి

ఎటపాక: మండలంలోని వినాయకపురంలో పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందాయి. కణితి గోపయ్యకు చెందిన పశువులు ఇంటి శివారులో చెట్ల కింద ఉన్న సమయంలో పిడుగు పాటుకు గురయ్యాయి. రెండు ఆవుల మృతితో జీవనాధారం కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు గోపయ్య కోరాడు.

చింతపల్లి రూరల్: మండలంలో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ సుమారు మూడు గంటలు పాటు ఉరుములు,మెరుపులతో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

వై.రామవరం: మండలంలో ఆదివారం సాయంత్రం సంభవించిన గాలివానకు జనజీవనం స్తంభించింది. విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలు పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మామిడి, జీడిమామిడి కాయలు రాలిపోవడంతో నష్టపోయామని రైతులు వాపోయారు.

రాజవొమ్మంగి: మండలకేంద్రం రాజవొమ్మంగి పరిసరాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనజీవనం స్తంభించింది. వాతావరణం అనుకూలంగా ఉండటంతో వరి నారుమడులకు రైతులు దుక్కి చేసుకుంటున్నారు.

క్లుప్తంగా

గంజాయి పట్టివేత

- ప్రైవేటు బస్సు సీజ్.. ముగ్గురు వ్యక్తులు అరెస్టు

గొలుగొండ: అక్రమంగా ప్రైవేట్ బస్సులో 19 కేజీల గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు గొలుగొండ ఎస్‌ఈబీ సీఐ రాజారావు తెలిపారు. చిత్రకొండ- నర్సీపట్నం వెళ్లే ప్రైవేట్ బస్సులో 19 కేజీల గంజాయి తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంమేరకు గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్టు తెలిపారు. నర్సీపట్నంకు చెందిన బి.కృష్ణ, లోవ వెంకటరమణ, వెంకటేష్ అనే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకి తరలించామని తెలిపారు. ప్రైవేట్ బస్సును సీజ్ చేసామని, వారి నుంచి ఒక సెల్‌ఫోన్, రూ.12వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గిరితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

యువతి మృతికి కారకుడైన యువకుడికి రిమాండ్

అనకాపల్లిటౌన్ : ప్రేమించి మోసపోయిన యువతి బలవన్మరణానికి కారకుడైన యువకుడిని పట్టణ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ దివాకర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో మూలపేట గ్రామానికి చెందిన అడపా గీత గాయత్రి(24) మూడేళ్ల క్రితం బుచ్చెయ్యపేట గ్రామానికి చెందిన మహేష్‌తో ప్రేమలో పడిందని ఎస్‌ఐ చెప్పారు. ఇటీవల గాయత్రి మహేష్ వద్ద పెళ్లి ప్రస్తావన తీసుకురాగా అనుమానిస్తూ వేధింపులకు పాల్పడడంతో మనస్తాపానికి గురైన గాయత్రి పురుగు మందు తాగి మృతి చెందింది. దీనిపై మృతురాలి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి మహేష్‌ను అరెస్టు చేసి స్థానిక న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మాకవరపాలెం: ఆర్టీసీ బస్సును బైకుతో ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గిడుతూరు గ్రామానికి చెందిన రవి ద్విచక్ర వాహనంపై ఆదివారం మధ్యాహ్నం నర్సీపట్నం వెళుతున్నాడు. కొండల అగ్రహారం ఇమ్మానుయేలు టీబీ ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి నర్సీపట్నం వెళుతూ ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో రవికి తల, ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. అతనిని స్థానికులు 108లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు.

600 లీటర్ల పులుపు ధ్వంసం

రావికమతం: ఆర్.కొత్తూరు గ్రామ శివారు పొలాల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల పులుపును, పలు రకాల మెటీరియల్‌ను కొత్తకోట పోలీసులు ఆదివారం ధ్వంసం చేశారు. ఆ గ్రామంలో పెద్ద ఎత్తున సారా తయారీ చేస్తున్నట్టు తమకు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి సామాగ్రి పులుపు ధ్వంసం చేశామని ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు.

మొక్కజొన్నతో లాభాల సిరులు

- ఏడాది పొడవునా సాగు
- ఆశించిన లాభాలు
- ఆనందంలో మాలీ రైతులు


దిగుబడికి వచ్చిన మొక్కజొన్నను విక్రయించేందుకు తరలిస్తున్న మహిళా రైతులు

గూడెంకొత్తవీధి: నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో ఏడాది పొడవునా మొక్కజొన్న సాగును గూడెంకొత్తవీధి మండలంలోని మాలీ రైతులు సాగు చేస్తున్నారు. కాలంతో పనిలేకుండా వీరు కాయగూరలతో పాటు మొక్కజొన్నను వాణిజ్య పరంగా సాగు చేస్తున్నారు. ఇవి వీరికి లాభాలను తెచ్చిపెడుతున్నాయి. సాధారణంగా ఏటా జూన్, జూలై, ఆగస్టు నెలల్లో మొక్కజొన్నను రైతులు ఖరీఫ్ పంటగా సాగు చేస్తారు. కానీ నీటి సదుపాయం ఉండడంతో మాలిగుడ, రింతాడ, ఊబలు, దుప్పిలవాడ ప్రాంతాల్లో మాలీరైతులు మొక్కజొన్నను వేసవి పంటగా సాగు చేస్తున్నారు. మేలు రకపు హైబ్రిడ్ విత్తనాలను వీరు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఒక్క మొక్కజొన్న పొత్తును రూ.10కి విక్రయిస్తున్నారు. కాయగూరలతో పాటు మొక్కజొన్నను వీరు వారపు సంతలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మన్యంలో మాలీ రైతులు పండించే మొక్కజొన్నను మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కొనుగోలు చేసి తరలిస్తున్నారు. గతంతో పోల్చితే మండలంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరిగిందని మండల వ్యవసాయాధికారి మధుసూదనరావు తెలిపారు. ఆశించిన గిట్టుబాటు ధరలు వస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మోదకొండమ్మ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర


మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర, ఇతర ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, పాడేరులోని మోదకొండమ్మతల్లి గిరిజన జాతరను ఈ ఏడాది అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర తెలిపారు. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు కొట్టగుల్లి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శులు నవర కొండబాబు, తమర్బ ప్రసాద్‌నాయుడు, ఇతర కార్యవర్గంతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే మోదకొండమ్మతల్లి ఉత్సవాల ఏర్పాట్లను వివరించారు. మోదకొండమ్మతల్లి ఉత్సవాలకు ప్రభుత్వంతో పాటు, ఆలయ కమిటీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహచలంనాయుడులు ఎంతో సహకరిస్తున్నారన్నారు.పాడేరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీల ప్రతినిధులంతా ఉత్సవాల విజయవంతానికి ఎంతో కృషి చేస్తున్నారని, అన్ని వర్గాల ప్రజలు తమ వంతుగా ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. ఉత్సవాలకు భారీ విద్యుత్ దీపాలంకరణ చేయనున్నట్టు తెలిపారు. ప్రముఖ కళాకారులు, సెలెబ్రిటీలతో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఉత్సవాలకు మంత్రులు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌తో పాటు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, అన్ని పార్టీల నాయకులు, వర్తకులు, ప్రజలు సహకరిస్తున్నారని కమిటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు కుడుముల వెంకటరమణ, ధర్మారావు, వుప్పల రత్నం, బూరెడ్డి రామునాయుడు, వంతెన్న రాజుబాబు, గోపాల్, లకే నానిపాత్రుడు.సోమరాజు, కృష్ణమూర్తి, మోహన్, శ్రీను, అప్పలరాజు, దాసరి నాగు పాల్గొన్నారు.

విశాఖకు మరో మణిహారం సీ-హారియర్

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ మల్లికార్జున

దొండపర్తి(విశాఖ దక్షిణ): బీచ్ రోడ్డులో ప్రారంభానికి సిద్ధమవుతున్న సీ-హారియర్ మ్యూజియం విశాఖకు మరో మణిహారంగా మారుతుందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11వ తేదీన విశాఖలో పర్యటిస్తున్న దృష్ట్యా పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. సీ-హారియర్ యుద్ధ విమాన మ్యూజియం, వైఎస్సార్ క్రికెట్ స్టేడియం, ఆరిలోవ అపోలో ఆస్పత్రి ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన సీ-హారియర్ మ్యూజియం విశాఖ వాసులకు, పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. టీయూ-142, కురుసుర సబ్ మెరైన్‌తో పాటు సీ-హారియర్ మ్యూజియం కూడా అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, యువత ఎన్నో విషయాలు తెలుసుకోడానికి అవకాశం కలుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా దీన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ ఈ మ్యూజియం ద్వారా యువత, పిల్లలు ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటవుతున్న సీ-హారియర్ మ్యూజియం పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందన్నారు. అనంతరం వైఎస్సార్ క్రికెట్ స్టేడియం వద్ద ముఖ్యమంత్రి హెలిప్యాడ్ పనులు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేడియం వద్ద ఏర్పాటు చేయనున్న దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. అక్కడి నుంచి ఆరిలోవలో అపోలో క్యాన్సర్ ఆసుపత్రిలో కార్యక్రమ ఏర్పాట్లపై ఆసుపత్రి నిర్వాహకులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జేసీ కె.ఎస్.విశ్వనాథ్, భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ, పోలీస్, ఫైర్, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ అంధుల సమాఖ్య ఉత్తరాంధ్ర యూనిట్ ఏర్పాటు

డాబాగార్డెన్స్: జాతీయ అంధుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు అనుబంధంగా ఉత్తరాంధ్ర యూనిట్‌ను ఏర్పాటు చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఎస్.అర్జునరావు అధ్యక్షతన ఉపాధ్యక్షులుగా బి. సుమలత, గౌరీశంకర్, చిన్న, ప్రధాన కార్యదర్శిగా కె.సూరిబాబు, సంయుక్త కార్యదర్శులుగా పి.లక్ష్మి, కనకారావు, యువ కార్యదర్శిగా జి.సురేష్, కోశాధికారిగా ఎస్.జోషి కిశోర్‌ను ఎన్నుకున్నారు. సమాఖ్య రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి మోపూరి రామసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన అంధులు పాల్గొన్నారు.

చార్జీ ఇవ్వలేదని బస్సులోనుంచి తోసేశారు

- వీడిన మధురవాడ యువకుడి మృతి మిస్టరీ
- ప్రైవేటు బస్సు డ్రైవర్, క్లీనర్ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆదాం

లావేరు : ఇటీవల శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై అనుమానాస్పద స్థితిలో లభ్యమైన యువకుడి మృతదేహానికి సంబంధించిన మిస్టరీ వీడింది. చార్జీ ఇవ్వలేదని బస్సులో నుంచి ప్రయాణికుడిని డ్రైవర్, క్లీనర్‌లు తోసేయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇందుకు బాధ్యులైన ప్రైవేటు బస్సు(గంగోత్రి) డ్రైవర్ వెలమశెట్టి రామకృష్ణ, క్లీనర్ బొమ్మాళి అప్పన్నలను ఆదివారం జేఆర్‌పురం సీఐ ఎస్.ఆదాం అరెస్టు చేశారు. అనంతరం లావేరు పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా మధురవాడకు చెందిన గేదేల భరత్‌కుమార్ ఈ నెల 2న రాత్రి తన స్నేహితులు వెంకటేష్, శివతో కలిసి శ్రీకాకుళం వచ్చాడు. 3వ తేదీ వేకువజామున 3.30 గంటల సమయంలో తాను మధురవాడ వెళ్లిపోతానని బస్సు ఎక్కించాలని స్నేహితులకు చెప్పడంతో వారు శ్రీకాకుళంలోని నవభారత్ జంక్షన్ వద్దకు తీసుకువచ్చి భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం వెళుతున్న గంగోత్రి అనే ప్రైవేటు బస్సును ఎక్కించారు. ఆ సమయంలో స్నేహితులు బస్సు చార్జీ ఫోన్‌పే చేస్తామని క్లీనర్‌కు చెప్పారు. బస్సు ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వచ్చినా ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించకపోవడంతో క్లీనర్ భరత్‌కుమార్‌ను చార్జీ డబ్బులు ఇవ్వమని అడిగాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. లావేరు మండలం బుడుమూరు వద్దకు వచ్చేసరికి డ్రైవర్ వెలమశెట్టి రామకృష్ణకు విషయం చెప్పగా బస్సు నుంచి తోసేయమని చెప్పాడు. దీంతో బస్సు వెళుతుండగానే భరత్‌కుమార్‌ను క్లీనర్ బయటకు తోసేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. తొలుత పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశలో దర్యాప్తు చేయగా ఈ విషయం బయటపడింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా గంగోత్రి బస్సుగా గుర్తించి ఆ రోజు డ్యూటీలో ఉన్న డ్రైవర్ రామకృష్ణ, క్లీనర్ అప్పన్నలను అదుపులోకి తీసుకొని విచారించారు. చార్జీ డబ్బుల కోసం జరిగిన గొడవలో భరత్‌కుమార్‌ను బస్సులోని నుంచి బయటకు తోసేశామని డ్రైవర్, క్లీనర్ నేరం అంగీరించారని సీఐ అన్నారు. సమావేశంలో లావేరు స్టేషన్ ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు, హెచ్‌సీ రామారావు, పీసీలు పాల్గొన్నారు.

కొట్లాటలో వ్యక్తికి తీవ్రగాయాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక నూకాంబిక ఆలయంలో ఆదివారం జరిగిన కొట్లాటలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ దివాకర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ పూర్ణామార్కెట్‌కు చెందిన వ్యాన్ అసోసియేషన్ సభ్యులు పట్టణంలో గవరపాలెం నూకాంబిక ఆలయం వద్దకు వనభోజనానికి వచ్చారు. మంచినీరు విషయంలో కాకర అప్పలరాజు, దుర్గాప్రసాద్, శ్రీను మధ్య వాగ్వాదం జరిగింది. ఈ ఘర్షణలో దుర్గాప్రసాద్, శ్రీనులు అప్పలరాజును కొట్టి గాయపర్చారు. బాధితుడిని చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పాయకరావుపేట : పెంటకోట గ్రామానికి చెందిన వ్యక్తిని తుని సమీపంలో లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి. పెంటకోట గ్రామానికి చెందిన ప్రగడ శ్రీను కాకినాడలో నివాసముంటున్నారు. పెంటకోటలో తన నాయనమ్మ రాజమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె పెద్దకర్మకు హాజరైన శ్రీను తిరిగి కాకినాడ వెళ్తుండగా శనివారం అర్ధరాత్రి అతను ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ప్రగడ శ్రీను (34) అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. శ్రీను మృతితో పెంటకోట గ్రామంలో విషాదం నెలకొంది.

ఆర్మీ ఉద్యోగికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

మహేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి


గాలిలోకి తుపాకులు పేలుస్తున్న పోలీసులు


మహేశ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: ఈ నెల 5న ఢిల్లీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇండియన్ ఆర్మీ ఉద్యోగి మధుమంతి మహేశ్ మృతదేహానికి ఆదివారం సాయంత్రం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మహేశ్ మృతదేహాన్ని ఆదివారం ఢిల్లీ నుంచి విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి దిబ్బపాలెం గ్రామానికి ప్రత్యేక వాహనంలో తరలించారు. మహేశ్ మృతదేహం వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు పరామర్శించారు. అనంతరం దిబ్బపాలెం గ్రామంలో గల శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో సైనికులు మూడుసార్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహం వద్ద భార్య ఉమా, తల్లి, ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ అంత్యక్రియలకు స్థానిక పోలీసులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కశింకోట: తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వివరాలివి. అనకాపల్లి-యలమంచిలి వైపు వెళ్లే మార్గంలో తాళ్లపాలెం హైస్కూలు వద్ద రోడ్డు దాటుతున్న 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తిని కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. అతని వివరాలు తెలియరాలేదన్నారు. ఆదివారం వీఆర్‌వో బొడ్డేడ శివాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అలల సంద్రంపై బతుకు విన్యాసం

కడలే వారికి అమ్మ ఒడి. అలల సవ్వడులు వారికి జోలపాట. సాగరంలో వేటే జీవనంగా సాగుతున్న మత్స్యకారుల జీవనశైలి అంతా విభిన్నం. అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ.. నిత్యం ఆటుపోట్ల మధ్య సాగే వీరి జీవనం ఓ సమరం. ఎగిసిపడే కెరటాలను సంవత్సరంలో 10 నెలలపాటు అవలీలగా దాటి సముద్రంలో చేపల వేట సాగించే వీరికి.. వేట నిషేధ సమయమే విశ్రాంతి. ఆ సమయంలో వీరి జీవనం పెను సవాలే.! ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా సాయం అందిస్తుండడంతో కొంత ఉపశమనం కలుగుతోంది.

– విశాఖపట్నం డెస్క్


ఫిషింగ్ హార్బర్‌లో బోటుకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

సాగర మథనం.. సాహస జీవనం

- మత్స్యకారుల జీవనం విలక్షణం
- సముద్రమే వీరి జీవనాధారం
- వేట నిషేధ సమయంలో జీవన పోరాటం
- వైఎస్సార్ మత్స్యకార భరోసాతో ఉపశమనం

జిల్లాలో తీర ప్రాంతం	24 కి.మీ
మత్స్యకార గ్రామాలు	15
ఫిష్ లాండింగ్ కేంద్రాలు	30
జిల్లాలో మర పడవలు	687
ఫైబర్ బోట్లు	1272
తెప్పలు	428

మత్స్యసంపద పరిరక్షణ కోసం సముద్రంలో వేట నిషేధం అమలవుతోంది. ఏపీ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1995 ప్రకారం సముద్రంలో చేపల వేటపై పలు ఆదేశాలున్నాయి. ఈ చట్టం 1997 నుంచి అమల్లోకి వచ్చింది. 2007 నుంచి 61 రోజుల పాటు వేట నిషేధం అమలవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 15న వేట నిషేధం అమల్లోకి రాగా.. జూన్ 14 వరకు కొనసాగనుంది. తొలి రోజుల్లో వేట నిషేధం అమలుకు అధికారులు పలు చోట్ల కష్టపడాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం సులువుగానే వేట నిషేధం అమలవుతోంది. వేట నిషేధం అనంతరం వస్తున్న ఫలితాలతో పాటు కన్నెర్ర చేసిన సంద్రం రూపు చూసిన మత్స్యకారులు అధికారుల ఆదేశాలను పాటిస్తున్నారు.

మత్స్యకారులు ఏం చేస్తారు? : వేట నిషేధం అమల్లోకి రాగానే ఫిషింగ్ హార్బర్‌కు బోట్లన్నీ చేరుకుంటాయి. ఏప్రిల్ 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అప్పటి వరకు వేటాడిన మత్స్య సంపద విక్రయాలు, వలలు భద్రపరచుకోవడం తదితర పనుల్లో మత్స్యకారులు నిమగ్నమవుతారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మత్స్యకారులు వారి స్వగ్రామాలకు వెళ్లిపోతారు. సొంత పనులు చేసుకోవడంతో పాటు ఆలయాలను సందర్శించడం, గ్రామాల్లో దేవత సంబరాలు జరుపుకోవడం తదితర కార్యక్రమాల్లో పాల్గొంటారు. జూన్ 1 నుంచి మళ్లీ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకొని వేటకు సమాయత్తమవుతారు. బోటు, వలలను సిద్ధం చేసుకుంటారు. కొందరు మత్స్యకారులు వలలు మరమ్మతులు చేసుకోవడం, అవకాశం ఉన్న వారు నగరంలో భవన నిర్మాణ పనులు, పెయింటింగ్ పనులకు వెళ్తుంటారు. కొందరు తెప్పల్లో మత్స్యవేట సాగిస్తుంటారు. భీమిలి నియోజకవర్గంలోని మత్స్యకారులు సమీపంలోని గోస్తనీలో వేట సాగిస్తుంటారు. ఆయా పనులు దొరకని పక్షంలో ఏదోలా కాలక్షేపం చేస్తుంటారు.


భీమిలిలో వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

బోసిపోయిన ఫిషింగ్ హార్బర్ : వేట నిషేధంతో ఫిషింగ్ హార్బర్ బోసిపోయింది. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయాయి. వినియోగదారులు ఇటువైపు రావడం మానేశారు. తెప్పలపై వేట చేసి తెచ్చిన కొద్ది పాటి చేపలను కొంత మంది మహిళలు ఇక్కడ విక్రయిన్నారు. ఎండేసిన నెత్తళ్లు, రొయ్యిలు విక్రయాలు కూడా అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. ఎండుచేపలను కూడా కేరళ తదితర ప్రాంతాలను దిగుమతి చేసుకుంటా మని మత్స్యకార మహిళలు చెబుతున్నారు. వీధుల్లో చేపలు విక్రయించే మత్స్యకార మహిళలు.. వేట నిషే ధ కాలంలో చెరువు చేపల అమ్మకం చేపడుతున్నారు. లేనివారు ఇతరాత్ర పనులకు వెళ్తున్నారు.

మత్స్యకారులకు భరోసా : రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. మత్స్యకారుల జీవితాల్లో చాలా మార్పు వచ్చింది. వేట విరామం సమయంలో గత ప్రభుత్వాలు అరకొర మందికి.. అదీ ఏడాదికి రూ.4 వేల ఆర్థిక సాయం, 20 కిలోల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకునేవి. అయితే ప్రస్తుత ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తోంది. వేట బోట్లకు డీజిల్ సబ్సిడీని గణనీయంగా పెంచింది. ప్రస్తుతం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో లబ్ధిదారుల ఎంపికకు సర్వే జరుగుతోంది.

వేసవిలోనే నిషేధం ఎందుకు?

వేట నిషేధం సరే.. మరి రెండు నెలలు ఎందుకు? అదీ వేసవిలో ఎందుకు అమలు చేస్తున్నారు? అనే ప్రశ్న అందరిలోనూ ఉత్పన్నమవుతుంది. ఒకప్పుడు బంగాళాఖాతంలో విలువైన జీవరాశులుండేవి. రానురానూ వాటి సంపద తగ్గిపోతోంది. ముఖ్యంగా వేసవిలో గుడ్లు పెట్టే దశలో వేట కారణంగా సంతానోత్పత్తి పడిపోతోంది. ఈ కాలంలో ట్రాల్ ఫిషింగ్ వల్ల సముద్రంలో బెడ్ నాగలితో దున్నినట్లు అయిపోతోంది. దీని వల్ల పునరుత్పత్తికి ఆటంకం ఏర్పడి.. అరుదైన జాతులు కూడా కనుమరుగవుతున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సముద్రంలో చేపల గుడ్లు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉంటుంది. గుడ్లు పిల్లలుగా మారి వేగంగా ఎదిగేందుకు ఈ ఉష్ణోగ్రత దోహదపడుతుంది. పైగా సముద్రంలో బెడ్‌ను ఆటంకం కలిగించకపోవడంతో చేపలకు ఆహారమైన ప్లవకాలు(జూ ప్లాంక్టన్, ఫైటో ప్లాంక్టన్) వృద్ధి చెందుతాయి. ఇలా చేపల వేట నిషేధం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. బంగాళాఖాతం తీర ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలలోనూ చేపల వేట నిషేధం అమలు చేస్తున్నారు. అందుకే నిషేధిత కాలంలో సముద్రంలో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచిస్తున్నట్లు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ జి.విజయ తెలిపారు.

వైఎస్సార్ మత్స్యకార భరోసా అమలు ఇలా...

జిల్లా	సంవత్సరం	లబ్ధిదారులు	జీవన భృతి(రూ.లో.)
విశాఖ	2022	11,334	11,33,40,000
ఉమ్మడి విశాఖ	2021	22,366	22,36,60,000
ఉమ్మడి విశాఖ	2020	20,273	20,27,30,000
ఉమ్మడి విశాఖ	2019	18,925	18,92,50,000